సాక్షి నంద్యాల

శనివారం, 6, జూలై, 2024



శాస్త్రోక్తంగా ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టా దశ శక్తిపీఠంగా వెలసిన శ్రీభ్రమరాంబాదేవికి శుక్రవారం అమ్మవారి మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు.



14 టీఎంసీల నీరు

హాలహర్వి/హొళగుంద: ఎగువ ప్రాంతాలలో వర్షాలు పడుతుండటంతో తుంగభద్ర రిజర్వాయర్ నీరు వచ్చి చేరుతోంది. జలాశయంలో శుక్రవారం 14 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



పెంపుడు జంతువులతో జాగ్రత్త

అవసరం కోసమో.. ఆనందానికో జంతువులను పెంచుకునే వారికి సంరక్షణలో అవగాహన ఉండటంలేదు. దీంతో రోగాలబారిన పడుతున్నారు. జూనోసిస్‌డే సందర్భంగా ప్రత్యేక కథనం.. 8లో

న్యూస్‌రీల్

అహోబిలేశుడి సేవలో ఈఆర్‌సీ చైర్మన్



స్వామిని దర్శించుకుంటున్న ఏపీ ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి

ఆళ్లగడ్డ: అహోబిల లక్ష్మీ నరసింహస్వామి వార్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఈఆర్‌సీ) చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. అహోబిలం చేరుకున్న ఆయనకు ఆలయ సంప్రదాయం మేరకు అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఎగువ, దిగువ అహోబిలం క్షేత్రాల్లోని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అర్చకులు ఆయనకు స్వామివార్ల శేషవస్త్రం, ప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనాలు అందించారు.

అందరూ మొక్కలు నాటాలి

- అటవీశాఖ జాయింట్ డైరెక్టర్ అనురాగ్ మీనా



తిమ్మాపురం మోడల్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న అనురాగ్ మీనా

మహానంది: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాల్సిన అవసరం ఉందని నంద్యాల జిల్లా అటవీశాఖ జాయింట్ డైరెక్టర్ అనురాగ్ మీనా అన్నారు. వన సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా తిమ్మాపురంలోని ఏపీ మోడల్ స్కూల్ ఆవరణలో శుక్రవారం విద్యార్థుల చేత ఆయన మొక్కలు నాటించారు. ప్రిన్సిపాల్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యత తీసుకుని పరిరక్షించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు.

కల్యాణ మండప నిర్మాణానికి రూ.4 లక్షల విరాళం



ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌కు విరాళం అందజేస్తున్న దాత కశెట్టి రమేష్

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలోని శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ ఆవరణలో కల్యాణ మండపం నిర్మాణానికి బెంగళూరు నగరానికి చెందిన కశెట్టి రమేష్ కుటుంబ సభ్యులు రూ.4 లక్షల విరాళాన్ని అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డికి శుక్రవారం వారు విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతను సన్మానించి అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఎన్ లక్ష్మీరెడ్డి, టీ రమణారెడ్డి, ఆర్ చిరంజీవారెడ్డి, పుల్లారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన హాస్టల్ నిర్మాణానికి స్థల పరిశీలన



బండిఆత్మకూరులో ఎంఈఓలు, ఉపాధ్యాయులతో చర్చిస్తున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

మహానంది: బండిఆత్మకూరు మండలంలో ట్రైబల్ హాస్టల్ నిర్మాణానికి స్థల పరిశీలన చేసినట్లు నంద్యాల జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. అలెస్కో కోఆర్డినేటర్ రఘునాథరెడ్డితో కలిసి శుక్రవారం బండిఆత్మకూరు తహసీల్దార్ సుమతి, డిప్యూటీ తహసీల్దార్ హరిత, సిబ్బందితో స్థలాల వివరాలు, రికార్డుల గురించి అడిగి తెలుసుకున్నారు. నారాయణపురం, శింగవరం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల వద్ద ఉన్న స్థలాల రికార్డులు పరిశీలించారు. అనంతరం శింగవరం, యర్రగుంట్ల తదితర పాఠశాలలకు వెళ్లి విద్యాబోధన, రికార్డుల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం మెనూ, తదితర వివరాలపై ఆరా తీశారు. ఆయన వెంట ఎంఈఓలు మోహన్‌రెడ్డి, యశోధ, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

పచ్చగడ్డి భగ్గుమంటోంది

- మాండ్ర, బైరెడ్డి వర్గాల మధ్య రగులుతున్న చిచ్చు
- నందికొట్కూరులో పట్టు కోసం ఇరువర్గాల ప్రయత్నం
- బైరెడ్డి జోక్యాన్ని సహించేది లేదంటున్న ఎమ్మెల్యే జయసూర్య



ఎస్సీ రిజర్వ్‌డ్ అయిన నందికొట్కూరు నియోజకవర్గంలోని టీడీపీలో నిప్పు లేకుండానే 'పచ్చ'గడ్డి భగ్గుమంటోంది. అగ్నికి ఆజ్యం తోడైనట్లు ఎన్నికల వేళ ఏర్పడిన విభేదాలకు ఇప్పుడు అధికార దర్పం చాటేందుకు ఇరువర్గాలు పోటాపోటీ పడుతున్నాయి. నియోజకవర్గంలో పెత్తనం చెలాయించేందుకు నాయకులు లోలోపల పావులు కదుపుతున్నారు. ఓ వైపు బైరెడ్డి రాజశేఖరరెడ్డి పట్టు సాధించేందుకు చక్రం తిప్పుతుండగా మాండ్ర శివానందరెడ్డి వర్గం చెక్ పెట్టే ప్రయత్నం చేస్తోంది.

సాక్షి, నంద్యాల: నందికొట్కూరు నియోజకవర్గంలో బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మాండ్ర శివానందరెడ్డి మధ్య వర్గపోరు భగ్గుమంటోంది. సాధారణ ఎన్నికల నుంచి వీరి మధ్య విభేదాలు మరింత ముదిరాయి. రెండు వర్గాల మధ్య మొదటి నుంచి విభేదాలు ఉన్నా గత ఎన్నికల్లో టీడీపీ ఎంపీ టికెట్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కుమార్తె బైరెడ్డి శబరికి, నందికొట్కూరు అసెంబ్లీ టికెట్ మాండ్ర శివానందరెడ్డి వర్గానికి చెందిన జయసూర్యకు దక్కాయి. రెండు వర్గాలు టీడీపీలో ఉన్నా ఒకరినొకరు సహకరించుకున్న పరిస్థితి లేదు. ఎవరి ప్రచారం వారే చేసుకున్నారు. ప్రత్యర్థుల్లానే వ్యవహరించారు. ఎన్నికల ఫలితాల అనంతరం అదే ధోరణి వ్యవహరిస్తుండటంతో వ్యవహారం తారా స్థాయి చేరుకుంటుంది. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు రెండు వర్గాల మధ్య రగడకు దారి తీశాయి. మాండ్ర వర్గం బైరెడ్డి ఫొటోలు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో చంద్రబాబు సమక్షంలోనే ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అప్పటి నుంచే రెండు వర్గాలు ఉప్పు.. నిప్పులా.. వ్యవహరిస్తూ వస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో ఎంపీ ఓటు 'నీకు ఇష్టమొచ్చిన వారికి వేసుకోవచ్చని' మాండ్ర వర్గం బాహటంగానే పిలుపునిచ్చింది. అలాగే 'ఎమ్మెల్యే ఓటు మీకు నచ్చిన వారికి వేసుకొని ఎంపీ ఓటు శబరికి వేయండి' అంటూ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి లోలోపల ప్రచారం చేశారు. మొత్తానికి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మాండ్ర వర్గానికి చెందిన జయసూర్య, ఎంపీగా బైరెడ్డి శబరి ఇద్దరూ గెలుపొందారు. అప్పటి నుంచి నియోజకవర్గంపై పెత్తనం కోసం రెండు వర్గాలు పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నాయి. ఒకరిపై ఒకరు ఆధిపత్యం సాధించేందుకు చేస్తున్న ప్రయత్నాలు నియోజకవర్గంలో శాంతిభద్రతల సమస్యకు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ముదిరిన వివాదం

తాజాగా శుక్రవారం నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డితో పాటు మరో 12 మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ చేరికలపై ఎమ్మెల్యే గిత్తా జయసూర్యకు కనీస సమాచారం ఇవ్వలేదు. బైరెడ్డి మొత్తం చక్రం తిప్పారు. తనకు తెలియకుండా టీడీపీలో కౌన్సిలర్లు చేరడంపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ సభ్యత్వం లేని బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పెత్తనాన్ని సహించేది లేదని బహిరంగంగానే ఎమ్మెల్యే తేల్చిచెబుతున్నారు.

బైరెడ్డి వ్యాఖ్యలు కలకలం..

ఇటీవల బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఓ సందర్భంలో మాట్లాడుతూ.. వలంటీర్లు, మధ్యాహ్న భోజనం కార్మికుల ఉద్యోగాలకు కొంత మంది నాయకులు డబ్బులు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. టీడీపీకి చెడ్డ పేరు వచ్చేలా నియోజకవర్గంలో ఎవరైనా ప్రవర్తిస్తే 'తోలు ఒలిచి ఉప్పుకారం పెడతానని' ఘాటుగా హెచ్చరించారు. ఎమ్మెల్యే జయసూర్యను ఉద్దేశించే బైరెడ్డి హెచ్చరికలు చేశారని పార్టీ శ్రేణుల్లో జోరుగా చర్చ సాగింది. దీతో వారి మధ్య దూరం మరింత పెరిగింది.

షాడో ఎంపీగా బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి..?

నంద్యాల ఎంపీగా బైరెడ్డి శబరి గెలిచి నప్పటికీ ఆమెను డమ్మీని చేసి జిల్లాలో రాజకీయం మొత్తం తన చేతుల్లోకి తీసుకోవాలని బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారు. ఫలితాలు వెలువడిన నాటి నుంచి జిల్లా అధికారులతో పాటు నియోజకవర్గ అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికే తీసుకొని రావాలని అధికారులకు సూచిస్తున్నట్లు సమాచారం. టీడీపీ సభ్యత్వమే తీసుకోకుండా టీడీపీ నాయకులపై బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పెత్తనం చేస్తుండటం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. నంద్యాల షాడో ఎంపీగా వ్యవహరిస్తున్న బైరెడ్డిపై సొంత పార్టీ నేతలే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నా సత్తా ఏమిటో చూపిస్తా.. ఎమ్మెల్యే జయసూర్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

ఇంత వరకు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డికి తెలుగుదేశం పార్టీలో సభ్యత్వమే లేదని, అలాంటి వ్యక్తి వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను, చైర్మన్‌ను టీడీపీలో ఎలా చేర్చుకుంటారని ఎమ్మెల్యే జయసూర్య విలేకరుల సమావేశంలో ఘాటుగా స్పందించారు. బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి టీడీపీకి చెందిన వ్యక్తి కాదని, బైరెడ్డి ఇప్పటి వరకు కండువా కూడా కప్పుకోలేదని, అలాంటి వ్యక్తి వేరే వాళ్లకు ఎలా కండువ కప్పి పార్టీలో చేర్చుకుంటారని ప్రశ్నించారు. మున్సిపాలిటీలో అవినీతి చేసిన వ్యక్తులను కాపాడేందుకే బైరెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. పాదయాత్ర సందర్భంగా మున్సిపాలిటీలో జరిగిన అవినీతిని నారా లోకేష్ రెడ్ బుక్‌లో రికార్డు చేశారన్నారు. బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆడుతున్న డ్రామా ఇది అన్నారు. ఎన్నికల్లో తనను ఓడించేందుకు కృషి చేసిన వ్యక్తుల్లో బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఒకరన్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలో పెత్తనం చేయాలంటే కుదరదని, 'నా సత్తా ఏమిటో చూపిస్తా' అంటూ సమావేశంలో వ్యాఖ్యానించారు.

ఎవరికి భయపడొద్దు.. మీకు నేను ఉన్నా : బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

'ఎవరి బెదిరింపులకు భయపడవద్దు. అందరం కలిసికట్టుగా పేదల అభ్యున్నతికి పని చేద్దాం. నేను మీకు అండగా ఉంటా' అంటూ మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డితో పాటు 12మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు వైఎస్సార్‌సీపీ నుండి టీడీపీలో చేరిన సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను రెండు సార్లు నందికొట్కూరు ఎమ్మెల్యేగా పని చేశానని, ఆ సమయంలో తాను నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధే నేటికి అందరికీ కనబడుతుందన్నారు. తమ కుటుంబం ఇప్పటికీ ప్రజల్లో ఉండేందుకు అప్పట్లో చేసిన అభివృద్ధే కారణమన్నారు. ఎంపీ శబరి ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి నందికొట్కూరు నియోజకవర్గానికి ఎక్కువ నిధులు సాధించి మరింత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

అహోబిలంలో అష్టబంధన మహా సంప్రోక్షణ పూజలు



ప్రత్యేక అలంకరణలో కొలువైన ఉత్సవమూర్తులు



అభిషేక పూజల్లో పాల్గొన్న పీఠాధిపతి

ఆళ్లగడ్డ: ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రం దిగువ అహోబిలంలో అష్టాబంధన మహా సంప్రోక్షణ పూజలు అహోబిలం పీఠాధిపతి శ్రీరంగరాజ యతీంద్ర మహాదేశికన్ స్వామీజీ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం వేకువజామున సుప్రభాత సేవతో మూల మూర్తులను మేలుకొలిపి నిత్య పూజలు నిర్వహించారు. అనంతరం జీర్ణోద్ధరణ అష్టబంధన మహా సంప్రోక్షణం కార్యక్రమాల్లో భాగంగా ఉదయం చతుస్థానార్చనం, పూర్ణాహుతి, శాత్తుమోరై, గోష్టి సాయంత్రం 49 కళశాలతో స్వామి, అమ్మవార్ల మూలమూర్తికి అభిషేకం నిర్వహించారు. ఈ పూజలు ప్రధానార్చకులు కీడాంబి వేణుగోపాలన్ ఆధ్వర్యంలో కొనసాగాయి.

చెంచు గిరిజనుల ఆర్థికాభివృద్ధికి కృషి

శ్రీశైలంప్రాజెక్ట్: చెంచు గిరిజనుల ఆర్థికాభివృద్ధికి వైకేపీ సిబ్బంది కృషి చేయాలని ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి అన్నారు. శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని పల్నాడు, నంద్యాల, ప్రకాశం జిల్లాలలో ఏర్పాటు చేసే ప్రధానమంత్రి వందన వికాస్ కేంద్రాలపై శుక్రవారం శ్రీశైలం ఐటీడీఏ కార్యాలయంలో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న వందన వికాస్ కేంద్రాలను అభివృద్ధి చేసి చెంచు గిరిజనులు స్వయం ఉపాధిలో రాణించే చూడాలన్నారు. గిరిజనుల అభ్యర్థన మేరకు నన్నారి నర్సరీలను ఏర్పాటు చేసి నాణ్యమైన మొక్కలను గిరిజన రైతులకు అందించాలన్నారు. వారి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించాలని తెలిపారు. చెంచుగూడేలలో ఇళ్లు, ఆధార్‌కార్డ్, రేషన్‌కార్డ్, వందన్‌బ్యాంక్ అకౌంట్ లేని వారి వివరాలను సేకరించి వారికి అవసరమైన వాటిని వైకేపీ అధికారులు, సిబ్బంది సమకూర్చాలని తెలిపారు. సమావేశంలో ఏపీఓ ఎ.సురేష్‌కుమార్, అధికారి బీసీ ధనుంజయ, మేనేజర్ బీవీ శేషగిరి రావు పాల్గొన్నారు.



వైకేపీ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి

వామ్మో చిరుత

- మళ్లీ ఆలయ పరిసరాల్లో సంచారం
- ఆందోళనలో భక్తులు



శుక్రవారం తెల్లవారుజామున ఆలయ పరిసరాల్లోకి చేరుకున్న చిరుత

మహానంది: వదల బొమ్మాళీ.. నిన్నొదలా! అంటుంది చిరుతపులి. ఒకటి కాదు, రెండు కాదు పలు పర్యాయాలు మహానంది ఆలయ పరిసరాల్లోకి వస్తుండటంతో భక్తులు, స్థానికులు భయాందోళన చెందుతోంది. తాజాగా శుక్రవారం తెల్లవారుజామున గోశాల ప్రాంగణంలోకి మరోసారి చిరుతపులి రావడం కలకలం రేపింది. నల్లమల వైపు నుంచి వచ్చిన చిరుతపులి గోశాల వద్ద టెంపుల్ రోడ్డు మీదుగా వచ్చి తిరిగి అడవివైపు వెళ్లినట్లు స్థానిక దేవస్థానం సీసీ కెమెరాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. ఇప్పటికే గత కొద్ది రోజుల నుంచి మహానంది ఈశ్వర్‌నగర్, పార్వతీపురం, పాత బంగ్లా, గోశాల ప్రాంగణంలోనే ఉంటుండటంతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. రెండ్రోజుల క్రితం నవనంది పుణ్యక్షేత్రాల్లో ఒకటైన కృష్ణనంది ఆలయం వద్ద ఓ చిరుతపులి కనిపించిన విషయం తెలిసిందే. గోశాల ప్రాంగణం వైపు పలు ప్రాంతాల భక్తులు వెళ్లకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. అటవీ అధికారులు వెంటనే స్పందించి చిరుతను బంధించి సుదూర ప్రాంతాలకు తరలించాలని భక్తులు కోరుతున్నారు.

పీఆర్‌లో పెండింగ్ బిల్లులపై ఆరా

- సమాచారాన్ని పంపాలని ఈఎన్‌సీ ఆదేశాలు

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జిల్లాలో జరుగుతున్న పనులు, బిల్లుల పెండింగ్‌కు సంబంధించిన వివరాలను పంపించాలని ఇంజినీర్ ఇన్ చీఫ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే జిల్లా అధికారులు ఈ వివరాలను పంపే పనిలో నిమగ్నమయ్యారు. ఏపీఆర్ఆర్‌పీ ప్యాకేజీ నెంబర్: 40, 41, 42, 43, 44 ఏ, బీ, సీ కింద చేపట్టిన గ్రామీణ రోడ్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి రూ.61.56 కోట్లు రావాల్సి ఉందని అధికారులు సమాచారాన్ని పంపుతున్నారు. అలాగే నాబార్డు, పీఆర్ఆర్ ప్లెయిన్, పీఆర్ఆర్ ఎస్‌సీసీ, పీఆర్ఆర్ ఎస్‌టీసీ, పీఆర్ రోడ్ అసెట్స్, పీఆర్ బిల్డింగ్స్, ఎంఆర్ఆర్ పాట్ హోల్స్ కింద రూ.67.14 కోట్లు, మండలానికి రూ.60 లక్షల ప్రకారం చేపట్టిన పనులకు సంబంధించి రూ.6.50 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు సమాచారాన్ని పంపుతున్నారు.

ఆకలి.. ఆక్రందన



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల విద్యార్థులు

- సిల్వర్‌జూబ్లీ హాస్టల్‌లో పురుగుల అన్నమే గతి
- నీళ్ల చారు, మజ్జిగ తప్ప మారని మెనూ
- తినలేక రోడ్డెక్కిన విద్యార్థులు
- కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా

కర్నూలు(సెంట్రల్): ఒక రోజు.. రెండు రోజులు కాదు.. నెల రోజులుగా వారికి పురుగుల అన్నమే దిక్కవుతోంది. కుళ్లిన వంకాయలు, టమాటాలతో చేసిన సాంబారు, మజ్జిగ తప్ప.. ఇతర కూరలు ఉండటం లేదు. ఎన్నిరోజులు ఓర్చుకున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు. ఆకలి ఉండలేక శుక్రవారం సిల్వర్‌జూబ్లీ హాస్టల్ విద్యార్థినీ, విద్యార్థులు రోడ్డెక్కారు. కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చారు. కలెక్టర్ బయటకు వచ్చి తమ సమస్యలు వినాలని, తమకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఖాళీ ప్లేట్లతో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. సిల్వర్ సెట్ రాసి మంచి ర్యాంకుతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కళాశాలలో చేరితే ఇక్కడ పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు. కళాశాల హాస్టల్‌లో 700 మంది ఉండగా.. ఇందులో 200 విద్యార్థులు, 500 మంది విద్యార్థినులు రోజూ ఆకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పురుగుల అన్నం, నీళ్ల సాంబారు, మజ్జిగ తప్ప మరో భోజనం తమకు పెట్టడం లేదన్నారు. అదేమని అడిగితే ప్రిన్సిపాల్, వార్డెన్‌లు సమాధానం చెప్పడం లేదన్నారు.

నిర్వహణ అస్తవ్యస్తం

డిగ్రీ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు చెల్లిస్తున్న మెస్‌చార్జీలు క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోకి వెళ్తున్నాయి. ఇదే సమయంలో ఫైనల్ ఇయర్ విద్యార్థుల మెస్‌చార్జీలు మాత్రమే సిల్వర్‌జూబ్లీ కళాశాల ఖాతాలో జమ అవుతున్నాయి. ఈ క్రమంలో కళాశాల ఖాతాలో జమ అయిన మొత్తంతో విద్యార్థులు, విద్యార్థినుల హాస్టళ్లలో భోజనంతోపాటు మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ఇబ్బందిగా మారింది. కళాశాల నిర్వహణకు క్లస్టర్ యూనివర్సిటీ నిధులను సమకూర్చడం లేదు. దీంతో ఫైనల్ ఇయర్ విద్యార్థులు చెల్లిస్తున్న ఫీజులతోనే మొత్తం మూడు సంవత్సరాల విద్యార్థుల హాస్టళ్ల నిర్వహణ జరగాలి. మరోవైపు ఒక్కో విద్యార్థికి మెస్‌చార్జీల కోసం నెలకు రూ.430 చెల్లిస్తారు. ఈ మొత్తంతో పెరిగిన నిత్యావసరాలు కొనుగోలు చేసి మూడు పూటలా భోజనం పెట్టేందుకు నిర్వాహకులకు ఇబ్బందిగా ఉంది. ఇందులో అధిక శాతం బియ్యం కొనుగోలుకే చెల్లించాల్సి వస్తోంది. కూరగాయలు, నూనెలు, ఇతర వస్తువులను కొనుగోలు చేయడానికి డబ్బు సరిపోవడంలేదు.

విత్తన శాంపిల్స్ సేకరణలో అలసత్వం

- ఇప్పటి వరకు 400 శాంపిల్స్ మాత్రమే సేకరణ
- విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు
- నాణ్యత లేకపోతే నష్టపోయే ప్రమాదం



సేకరించిన వరి విత్తనాల శాంపిల్స్

నంద్యాల(అర్బన్): నాణ్యమైన విత్తనంతోనే ఆశించిన స్థాయిలో పంట దిగుబడి కూడా వస్తుంది. తెగుళ్లు, చీడపీడల సమస్య కూడా ఉండదు. విత్తనంలో నాణ్యత లేకపోతే రైతులు తీవ్రంగా నష్ట పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అంతటి ప్రాధాన్యత గల విత్తనాలు నాణ్యమైనవో, కాదో తెలుసుకునేందుకు ఏటా ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విక్రయించే విత్తనాల నుంచి శాంపిల్స్ సేకరిస్తారు. అయితే ఈ ఏడాది విత్తన శాంపిల్స్ సేకరణలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. శాంపిల్స్ సేకరణ పూర్తి కావాల్సి ఉన్నా ఇప్పటి వరకు సగం కూడా శాంపిల్స్ వ్యవసాయ అధికారులు సేకరించలేదు. జిల్లాలో ఖరీఫ్ కింద అన్ని పంటలు కలిపి 2,36,906 హెక్టార్ల వరకు సాగు చేస్తారు. ఇందులో 65,785 హెక్టార్ల వరకు వరి పంటే సాగు చేస్తారు. ఈ మేరకు విత్తన శాంపిల్స్ 1,200 సేకరించాలన్నది లక్ష్యం కాగా అధికారులు ఇంత వరకు కేవలం 400 శాంపిల్స్ మాత్రమే సేకరించారు. ఇంకా 800 శాంపిల్స్ సేకరించాల్సి ఉంది. జిల్లాలో ఇప్పటికే రైతులు విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల వద్ద కొందరు, ప్రైవేట్ డీలర్ల వద్ద మరికొంత మంది విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. రైతులు పొలంలో విత్తనాలను సాగు చేసే ముందే విత్తనం నాణ్యమైనదో కాదో తెలియాలి. నాణ్యత లేని విత్తనాలు సాగు చేయడం వల్ల పంట ఎదుగుదల ఉండదు. రైతు పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఉంటుంది.

యాప్‌లో నమోదు..

విత్తన శాంపిల్స్ సేకరించిన వెంటనే వివరాలను ఇన్‌సైట్ యాప్‌లో సంబంధిత మండల వ్యవసాయ అధికారి నమోదు చేస్తారు. యాప్‌లో నమోదు చేయగానే ఆ వివరాలు రీజనల్ కోడింగ్ సెంటర్‌కు వెళ్తాయి. జిల్లాకు సంబంధించి తిరుపతిలో కోడింగ్ సెంటర్ ఉంది. అక్కడి నుంచి వివరాలు రాగానే విత్తన పరీక్ష కేంద్రానికి పంపిస్తారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో ఉన్న విత్తన పరీక్ష కేంద్రంలో పరీక్షించిన మీదట రిపోర్టులను అక్కడి నుంచి కోడింగ్ సెంటర్‌కు వస్తాయి. తర్వాత సంబంధిత జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి రిపోర్టు పంపిస్తారు. రిపోర్టులో నాణ్యత లేని వాటిపై వ్యవసాయాధికారులు కేసులు నమోదు చేస్తారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకుంటాం. అటువంటి వారికి ఆరు నెలలకు పైగా జైలు శిక్ష పడే అవకాశం ఉంది. అదే విధంగా కల్తీ, నాసిరకం పురుగు మందులు అయితే 3 సవత్సరాలు, ఎరువులు అయితే ఏడళ్ల వరకు జైలు శిక్ష పడుతుంది. విత్తన నాణ్యతలో ఎవరూ రాజీ పడవద్దు.

–మురళీకృష్ణ, డీఏఓ, నంద్యాల

క్లుప్తంగా

ఆర్‌యూ లా ఫలితాల విడుదల

కర్నూలు కల్చరల్‌: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్‌లో జరిగిన లా 3, 5 సంవత్సరాల 2, 4, 6, 8, 10 సెమిస్టర్‌ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. వర్సిటీ రెక్టార్‌ ఆచార్య ఎన్‌టీకే నాయక్‌ ఆదేశాల మేరకు విడుదల చేసినట్లు వర్సిటీ కంట్రోలర్‌ ఆఫ్‌ ఎగ్జామినేషన్స్‌, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌ డాక్టర్‌ సముద్రాల వెంకటేశ్వర్లు తెలిపారు. లా మూడు సంవత్సరాల కోర్సు రెగ్యులర్‌ 4వ సెమిస్టర్‌లో 199 మందికి 172 మంది, 6వ సెమిస్టర్‌లో 238 మందికి 229, 5 సంవత్సరాల కోర్సు 4వ సెమిస్టర్‌లో 39 మందికి 16, 6వ సెమిస్టర్‌లో 30కి 24, 8వ సెమిస్టర్‌లో 44 మందికి 35 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయినట్లు తెలిపారు. లా మూడు సంవత్సరాల కోర్సు సప్లిమెంటరీ 2వ సెమిస్టర్‌లో 23 మందికి 13 మంది, 4వ సెమిస్టర్‌లో 45 మందికి 13, 6వ సెమిస్టర్‌లో 12 మందికి 10, 5 సంవత్సరాల కోర్సు 4వ సెమిస్టర్‌లో 15 మందికి ముగ్గురు, 6వ సెమిస్టర్‌లో ఐదుగురికి ఇద్దరు, 8వ సెమిస్టర్‌లో నలుగురికి ఒకరు, 10 సెమిస్టర్‌లో నలుగురికి ఇద్దరు విద్యార్థులు ఉత్తీర్ణులు అయినట్లు తెలిపారు.

సారా స్థావరాలపై రోజూ దాడులు చేయండి

కర్నూలు: జిల్లాలో నాటుసారా తయారీ, మద్యం అక్రమ రవాణా విషయంలో కొత్త చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని సెబ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సూపరింటెండెంట్‌ రవికుమార్‌ ఆదేశించారు. శుక్రవారం ఉదయం 11 నుంచి 2.30 గంటల వరకు తన కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని 26 గ్రామాల్లో నాటుసారా తయారీ కేంద్రాలు ఉన్నాయని.. సమాచార వ్యవస్థను పెంచుకుని ప్రతిరోజూ ఆయా గ్రామాల్లో దాడులు నిర్వహించాలన్నారు. అలాగే చెక్‌పోస్టు అధికారులతో సమన్వయం చేసుకుని సరిహద్దుల్లో నిఘా పెంచుకుని పొరుగు రాష్ట్రాల మద్యం జిల్లాలోకి రాకుండా పూర్తిగా నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 2017 నుంచి ఇప్పటివరకు 37 గంజాయి కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని మూడు రోజుల్లోగా నివేదిక సమర్పించాలని సీఐలకు ఈఎస్‌ ఆదేశించారు.

పెంపుడు జంతువులతో జాగ్రత్త!

- 280 వరకు వ్యాధులు సంక్రమించే అవకాశం
- కుక్కల నుంచి సోకే రేబిస్‌ ప్రమాదకరమైనది
- నేడు పెంపుడు కుక్కలకు 'రేబిస్‌' టీకాలు
- ఉమ్మడి జిల్లాకు 12,200 వ్యాక్సిన్‌ సరఫరా
- నేడు ప్రపంచ జూనోసిస్‌ దినోత్సవం

అవసరం.. ఆత్మీయత.. ఆనందం.. జీవనోపాధి.. కారణమేదైనా మనిషి జీవితంలో పెంపుడు జంతువులు భాగమైపోయాయి. కుక్కలు, పిల్లులు, ఆవులు, గేదెలు, జీవాలు, పావురాలు, కోళ్ల తదితర వాటిని పెంచుకునే వారు చాలా మంది ఉన్నారు. వీటి సంరక్షణలో అవగాహన లేకపోవడంతో కొంతమంది రోగాలబారిన పడుతున్నారు. జంతువులతో మానవులకు సంక్రమించే వ్యాధులు, నివారణ మార్గాలపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది జూలై 6న జూనోసిస్‌డే (జంతువుల నుంచి సంక్రమించే వ్యాధుల నివారణ దినోత్సవం)గా జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక కథనం.

– కర్నూలు(అగ్రికల్చర్‌)/గోస్పాడు



ఇష్టంగా పెంచుకునే కుక్కల నుంచి రేబిస్‌ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. అలాగే పాడి పశువుల నుంచి అంత్రాక్స్‌, క్షయ, బ్రూసెల్లోసిస్‌, గొర్రెలు, మేకలు, కోళ్ల నుంచి బర్డ్‌ఫ్లూ తదితర వ్యాధులు సంక్రమిస్తున్నాయి. పశువులు, పక్షుల నుంచి సుమారు 280 వరకు వ్యాధులు సోకుతున్నట్లు గుర్తించారు. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఈ వ్యాధుల బారిన పడకుండా ఉండే అవకాశం ఉంది. పెంపుడు జంతువులు నాకిన శరీర భాగాల్ని సబ్బుతో శుభ్రపర్చుకోవాలి. కుక్కలకు విధిగా రేబిస్‌ నివారణ టీకాలు వేయించాలి. పాలను బాగా మరిగించిన తర్వాతనే తాగాలి. వ్యాధి సోకిన జంతువుల మాంసం తినకూడదు. పెంపుడు జంతువుల ఆవాసాలను క్రిమి సంహారక మందులతో తరూ శుభ్రం చేయడంతోపాటు పాడి పశువులను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలి.

వ్యాధులు.. నివారణ చర్యలు

జూనోటిక్‌ వ్యాధులు వివిధ రూపాల్లో సంక్రమిస్తాయి. వీటిలో వైరస్‌ ద్వారా రేబిస్‌, మెదడువాపు, హెపటైటీస్‌, అమ్మవారు, డెంగీ ఫీవర్‌ సోకుతాయి. బ్యాక్టీరియల్‌ ద్వారా అంత్రాక్స్‌, బ్రూసెల్లోసిస్‌, లెప్టోస్పైరోసిస్‌, సాల్మనెల్లోసిస్‌, లిస్టిరియోసిస్‌, టీబీ సంక్రమిస్తాయి. పారాసైటిక్‌ ద్వారా అమీబియాసిస్‌, బాలాంటిడియోసిస్‌, టాక్సోప్లాస్మోసిస్‌, టీనియాసిస్‌, హైడాటిబోసిస్‌, ట్రైచినెల్లోసిస్‌, ఆంకైలోస్టోమియాసిస్‌, ఆస్కారియసిస్‌, ఫైలేరియాసిస్‌, స్కేబిస్‌(గజ్జి), డ్రాకంకులోసిస్‌ వ్యాధులు వస్తాయి.

- బ్రూసెల్లోసిస్‌ వ్యాధి పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కుక్కల ద్వారా సంక్రమిస్తుంది. వ్యాధి సోకిన పశువు పచ్చి పాలు తాగడం వల్ల, మాంసం సరిగ్గా ఉడకబెట్టకుండా తినడం వల్ల సంక్రమిస్తుంది. జిల్లాలో గతంలో ఐదుగురు పారా సిబ్బంది, ఒక గొర్రెల కాపరి ఈ వ్యాధి బారిన పడ్డారు. ఆకలి మందగించడం, ఎక్కువ చెమట పట్టడం, జ్వరం, తలనొప్పి, కీళ్ల నొప్పులు, నడుం నొప్పి వస్తే వెంటనే వైద్యున్ని సంప్రదించి చికిత్స తీసుకోవాలి.
- రేబిస్‌ ప్రాణాంతకమైన వ్యాధి. ఈ వ్యాధి సోకిన కుక్కలు మనుషులను, పశువులను కరవడం వల్ల వస్తుంది. కుక్క చొంగద్వారా కూడా వ్యాధి వ్యాప్తి చెందుతుంది. వ్యాధి లక్షణాలు బయట పడిన తర్వాత చికిత్సలేదు. కుక్క కరిచిన 10 రోజుల నుంచి కొన్ని నెలల వరకు వ్యాధి కనిపించే అవకాశం ఉంటుంది. యాంటి రేబిస్‌ టీకా కోర్సు ప్రకారం వేయించుకోవాలి. ఈ వ్యాధి సోకిన మనిషి నీటిని చూచి భయపడటం గమనించవచ్చు.
- అంత్రాక్స్‌ వ్యాధి.. పశువులతో సన్నిహితంగా మెలగడం, వ్యాధి సోకిన పశువు, గొర్రె మాంసాన్ని ఉడికించకుండా తినడం వల్ల వస్తుంది. ఉన్ని, బొచ్చులలో రోగకారక క్రిములను పీల్చడం వల్ల సంక్రమిస్తుంది. ఊపిరితిత్తులకు వ్యాధి సోకితే దగ్గు, తీవ్ర ఆయాసం, ఛాతిలో నొప్పి వస్తాయి. పేగులకు వ్యాధి సోకితే రక్తం చీముతో కూడిన అతిసారం ఏర్పడుతుంది. తోళ్ల పరిశ్రమలో పనిచేసేవారు నోటికి, ముక్కుకు మాస్కులు ధరించాలి. మాంసాన్ని బాగా ఉడికించి తినాలి.

నేడు రేబిస్‌ టీకాలు

జంతువుల నుంచి సోకే వ్యాధులపై పశుసంవర్ధక శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జూనోసిస్‌ దినోత్సవం సందర్భంగా శనివారం అన్ని ఏరియా పశువైద్యశాలలు, వెటర్నరీ డిస్పెన్సరీల్లో పెంపుడు కుక్కలకు యాంటి రేబిస్‌ వ్యాధి టీకాలు వేయనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు 12,200 డోసుల రేబిస్‌ టీకా సరఫరా అయింది. కర్నూలు జిల్లాకు 7600, నంద్యాల జిల్లాకు 4600 ప్రకారం సరఫరా కాగా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం అధికారులు అన్ని మండలాలకు సరఫరా చేశారు.

- బర్డ్‌ఫ్లూ కోళ్లు, బాతులు, వలసపక్షులు, పెంపుడు పక్షులలో మొదట సంక్రమించి తద్వారా మనుషులలో వ్యాపించి మరణాలు కలుగజేస్తుంది. నివారణకు కోడిగుడ్లు, కోడి మాంసం బాగా ఉడికించి తినాలి. వ్యాధి సోకిన ప్రాంతాల్లో కోళ్లు, బాతులు, ఇతర పక్షులను శాస్త్రీయంగా నిర్మూలించాలి.

లెప్టోస్పైరోసిస్‌ వ్యాధి..

ఎలుకలు, కుక్కలు, పశువుల నుంచి మనుషులకు సంక్రమిస్తుంది. ఎలుకలు, కుక్కలు, పశువులు మూత్రం ద్వారా పరిసర ప్రాంతాలను, నీటి వనరులను కలుషితం చేస్తాయి. ఆ నీరు తాగడం వల్ల వ్యాధి వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధితో మూత్రపిండాలు దెబ్బతింటాయి. నరాల బలహీనత, కడుపు నొప్పి వస్తుంది. కలుషితమైన నీరు తాగకుండా, కలుషిత ఆహారం తినకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

అప్రమత్తంగా ఉండాలి



జూనోటిక్‌ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి. పశువులు, కుక్కలు, పిల్లులు పెంచుకునేవారు అప్రమత్తంగా ఉండాలి. క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. కర్నూలు నగరానికి సంబంధించి బహుళార్థ పశువైద్యశాలలో పెంపుడు కుక్కలు, పిల్లులకు రేబిస్‌ టీకాలు వేస్తున్నారు. ఈ పశువైద్యశాలకు 1000 డోసుల వ్యాక్సిన్‌ సరఫరా అయ్యింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్‌ రవిబాబు, అసిస్టెంట్‌ డైరెక్టర్‌, ఉమ్మడి జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం

అందుబాటులో వ్యాక్సిన్లు



జిల్లాలో 23,870 డోసుల రేబిస్‌ వ్యాక్సిన్‌ అందుబాటులో ఉంది. జిల్లా అంతటా 6,312 పెంపుడు కుక్కలు ఉన్నట్లు గుర్తించాం. యజమానులు కుక్కలకు వ్యాక్సిన్‌ వేయించుకోవాలి. వ్యాధుల పట్ల మరిన్ని సలహాలు సంప్రదించడం కోసం ప్రభుత్వం 1962 టోల్‌ ఫ్రీ నంబర్‌ను కూడా ఏర్పాటు చేసింది.

– గోవిందనాయక్‌, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి, నంద్యాల

పిచ్చికుక్కల దాడిలో ఐదుగురికి గాయాలు

పాణ్యం: స్థానిక అయ్యప్పరెడ్డి కాలనీలో పిచ్చికుక్కలు ఐదుగురిపై దాడిచేసి కరిచాయి. గాయపడిన వారు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. పిచ్చికుక్కలను పట్టుకునేందుకు కాలనీ వాసులు వెంటబడ్డారు. ఈ మధ్యకాలంలో గ్రామంలో కుక్కలు అధికమవడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

లారీ ఢీ..నంద్యాల వాసి దుర్మరణం

- రోడ్డుపై పడి లేస్తుండగా దూసుకెళ్లిన మరో లారీ
- ఘటనలో మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



అశోక్‌ (ఫైల్‌)

మదకశిర రూరల్‌: జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో నంద్యాలకు చెందిన ఓ యువకుడు దుర్మరణం చెందాడు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాలకు చెందిన అశోక్‌, నవీన్‌ గణేష్‌, గద్వాల్‌కు చెందిన అనిల్‌ స్నేహితులు.. వీరు కోళ్ల ఫారంలో సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్నారు. విధుల్లో భాగంగా రెండు ద్విచక్ర వాహనాలపై గుడిబండ మండలం సీసీగిరిలోని పౌల్ట్రీఫారంను గురువారం సందర్శించి, కోడి పిల్లలను లెక్కించారు. అనంతరం రాత్రి మడకశిరకు వెళ్తుండగా యూ.రంగాపురం సమీపంలోకి చేరుకోగానే జాతీయ రహదారిపై వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టి వెళ్లిపోయింది. రోడ్డుపై పడిన నలుగురూ పైకి లేస్తుండగా వెనుక నుంచి వచ్చిన మరో లారీ వారిపై నుంచి దూసుకెళ్లడంతో అశోక్‌ (21) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన నవీన్‌, గణేష్‌, అనిల్‌ను అటుగా వెళ్తున్న వారు 108 అంబులెన్స్‌లో మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు శుక్రవారం ఉదయం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులతో వివరాలు ఆరా తీసి, కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన లారీలను గుర్తించేందుకు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆకతాయికి జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఆకతాయికి సెకండ్‌క్లాస్‌ మెజిస్ట్రేట్‌ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి రెండు జైలు శిక్షను ఖరారు చేశారు. టెక్కె ప్రాంతానికి చెందిన గాజా నరేష్‌కుమార్‌ రోడ్డుపై వెళ్తున్న మహిళల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తుండటంతో స్థానికులు టూటౌన్‌ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆకతాయిని అరెస్ట్‌ చేసి, కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రెండు రోజులు జైలు శిక్ష ఖరారు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రాణం తీసిన విద్యుదాఘాతం

మంత్రాలయం: బతుకు తెరువు కోసం వచ్చిన ఓ యువకుడు విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డాడు. ఎస్‌ఐ గోపీనాథ్‌ తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం రాయిఘర్‌ తాలూకాగంగాపర పంచాయతీలోని హతిబెన గ్రామానికి చెందిన మణిరామ్‌ గోండ్‌ కుమారుడు మంత్రి గోండ్‌ (32) బోర్‌వెల్‌ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం మంత్రాలయం మండలం సూగూరు గ్రామంలోని ఓ రైతు పొలంలో బోరు వేసేందుకు బయలుదేరారు. దారిలో వెళ్తున్న బోరువెల్‌ లారీ ప్రమాదవశాత్తు వేలాడుతున్న విద్యుత్‌ తీగలను తాకడంతో గోండ్‌ విద్యుత్‌ షాక్‌కు గురయై మృతి చెందాడు.

కోరుమాన్‌పల్లె డీలర్‌పై ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎస్‌టీటీఎఫ్‌ నాయకులు

నంద్యాల(న్యూటౌన్‌): కొలిమిగుండ్ల మండలం కోరుమానుపల్లెలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లును అసభ్య పదజాలంతో దూషించిన రేషన్‌ డీలర్‌, టీడీపీ నాయకుడు విజయభాస్కర్‌రెడ్డిపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. నంద్యాల పట్టణంలో ఎస్‌టీటీఎఫ్‌ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుధాకర్‌, కుమార్‌ మాట్లాడుతూ ఎంఈఓ అనుమతి లేకుండా రేషన్‌ బియ్యాన్ని పాఠశాలల గదుల్లో పెట్టరాదని అడ్డుకున్న ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ఉపాధ్యాయుడిని డీలర్‌ నోటికి వచ్చినట్లు తిట్టడం దారుణమన్నారు. విధుల్లో ఉన్న ఉపాధ్యాయుడిని దుర్భాషలాడినా విద్యాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. విధులకు ఆటంకం కలిగించి భయభ్రాంతులకు గురి చేసిన డీలర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా రాజకీయ నాయకులను కట్టడి చేయాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో ఉపేంద్ర, నాగరాజు, రామకృష్ణ, రాము, తదితరులు పాల్గొన్నారు. ఎస్‌టీయూ నంద్యాల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మౌలాలి, అజామ్‌బేగ్‌ మాట్లాడుతూ కోరుమానుపల్లె ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లను బెదిరించిన టీడీపీ నాయకుడిని వెంటనే అరెస్ట్‌ చేయాలన్నారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తే సహించేది లేదన్నారు.

రేషన్‌పై డీలర్‌పై చర్యలు తీసుకోవాలి

ఉపాధ్యాయుడిని అసభ్య పదజాలంతో దుర్భాషలాడిన కోరుమాన్‌పల్లె రేషన్‌ డీలర్‌ విజయభాస్కర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్‌ చేశారు. రేషన్‌ బియ్యాన్ని పాఠశాలలో నిల్వ చేయాలనే అంశంలో జరిగిన వాగ్వాదంలో పాఠశాల ఉపాధ్యాయుడి తప్పేమి లేదన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థుల భద్రత దృష్ట్యా తిరస్కరించడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని రహదారుల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లినట్లు డీఈఓ తెలిపారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

భార్య వేధింపులు తాళలేక ఆత్మహత్య



రోహిత్‌కుమార్‌ (ఫైల్‌)

గుంతకల్లు: భార్య వేధింపులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు.. పాత గుంతకల్లుకు చెందిన వడ్డె రోహిత్‌కుమార్‌ (24) బజాజ్‌ షోరూంలో మెకానిక్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఏడాది క్రితం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన లక్ష్మీదేవితో అయనకు వివాహమైంది. పెళ్లి అయినప్పటి నుంచి భర్తను సూటిపోటి మాటలతో లక్ష్మీదేవి మానసిక క్షోభకు గురి చేస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే ఈ ఏడాది జనవరిలో లక్ష్మీదేవి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి ఆమె కాపురానికి రాకుండా పుట్టింట్లోనే ఉండిపోయింది. కాపురానికి రావాలని భర్త పలుమార్లు ప్రాధేయపడ్డాడు. అయితే తాను పెట్టిన కండీషన్లు ఒప్పుకుంటే కాపురానికి వస్తానని ఆ సమయంలో ఆమె తేగిసి చెబుతూ వచ్చింది. విషయం తెలుసుకున్న రోహిత్‌ కుమార్‌ తల్లిదండ్రులు కోడలి కండీషన్ల మేరకు ఆమె పేరుతో కొంత, బాబు పేరుతో మరికొంత స్థలం రాసిచ్చిన తర్వాత కాపురానికి వచ్చింది. అయితే మూడు నెలల క్రితం బాబు చనిపోయాడు. ఆ తర్వాత భర్తను వదిలి లక్ష్మీదేవి పుట్టింటికి వెళ్లిపోయింది. తన భార్య వేధిస్తున్న విషయంపై ఆరు రోజుల క్రితం గుంతకల్లు రెండో పట్టణ పోలీసులకు రోహిత్‌ ఫిర్యాదు చేశాడు. దీంతో సీఐ గణేష్‌ ఇరువురి వాదనలు విన్నారు. తర్వాత పెద్దల సమక్షంలో తామే పంచాయితీ చేసుకుంటామని బాధితులు తెలపడంతో వారిని అక్కడి నుంచి పంపించేశారు. సమస్య మరింత జటిలం కావడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న రోహిత్‌ గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి క్రిష్టప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తమ్మరాజుపల్లె ఘాట్‌లో దారి దోపిడీ

- దంపతులను బెదిరించి నగలు, నగదు అపహరణ

బేతంచెర్ల: సిమెంట్‌ నగర్‌ – నంద్యాల రహదారిలో తమ్మరాజు పల్లె ఘాటురోడ్డులో దొంగలు దారిదోపిడీకి పాల్పడ్డారు. ఈనెల 4వ తేదీన జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల మేరకు అనంతపురం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి తన భార్యతో కలిసి కారులో వైజాగ్‌ వెళ్లి వస్తుండగా ఈ దోపిడీ జరిగింది. గురువారం ఉదయం తమ్మరాజు పల్లె ఘాట్‌ ఎక్కిన తరువాత కాలకృత్యాలు తీర్చుకునేందుకు కారును ఆపారు. అక్కడ మాటు వేసిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వారి దగ్గరకు వచ్చి వారిని ఆటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి చెట్టుకు కట్టేసి కొట్టారు. వారి వద్ద ఉన్న రూ.6,500 నగదు, ఆమె మెడలో ఉన్న బంగారు చైను, ముక్కురాళ్లు, చెవిలో కమ్మలు లాక్కున్నారు. దోపిడీ విషయం ఎక్కడైనా చెప్తే చంపేస్తామని బెదిరించి వదిలేశారు. అక్కడి నుంచి సిమెంట్‌ నగర్‌ చేరుకున్న బాధితులు జరిగిన విషయాన్ని గ్రామస్తులకు తెలిపారు. అయితే బాధితులు భయంతో పోలీసులకు ఫిర్యాదు చేయకుండా వెళ్లిపోయారు. వారం క్రితం రాత్రి 8 గంటల సమయంలో ఓ ఆటో తమ్మరాజుపల్లె మీదుగా సిమెంట్‌ నగర్‌ వైపు వస్తుండగా అదే ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు విసిరి ఆపే ప్రయత్నం చేశారు. అయితే డ్రైవర్‌ శివ అప్రమత్తమై ఆటో ఆపకుండా వేగంగా తప్పించుకుని వెళ్లి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘాట్‌ రోడ్డులో తరచూ ఇలాంటి దారిదోపిడీ సంఘటనలు జరుగుతున్నా పోలీసులు ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. ఈ రహదారిలో గస్తీ నిర్వహించకపోవడం, దొంగలు ఉన్నట్లు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో దొంగలు యథేచ్ఛగా దోపిడీలకు పాల్పడుతున్నారు. పట్ట పగలు దోపిడీలు జరగడంతో అటు వైపు వెళ్లే వాహనాదారులు, సిమెంట్‌ నగర్‌, తమ్మరాజుపల్లె గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

అల్లుడే కాలయముడు..

- మరో ఇద్దరితో కలిసి మామపై దాడి
- వేటకొడవళ్లతో నరికి హతమార్చి..
- భార్యను కాపురానికి పంపలేదనే కక్ష



హతుడు లక్ష్మన్న

గుంతకల్లు రూరల్‌: అల్లుడే కాలయముడయ్యాడు. కుమార్తెను కాపురానికి పంపలేదన్న కక్షతో మరో ఇద్దరితో కలిసి వేటకొడవళ్లలో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఘటనలో మామ అక్కడికక్కడే హతమయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు, కుటుంబసభ్యులతో పాటు ఏమీ తెలియని వాడిలా తానూ అక్కడకు చేరుకున్నాడు. క్షణాల వ్యవధిలోనే స్నిప్పర్‌ డాగ్‌ నిందితుడిని పోలీసులకు పట్టించింది. గుంతకల్లు రూరల్‌ ఎస్‌ఐ సురేష్‌ తెలిపిన మేరకు.. గుంతకల్లు మండలం నల్లదారపల్లికి చెందిన లక్ష్మన్న (50), కృష్ణవేణి దంపతులకు నలుగురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న లక్ష్మన్న.. నాలుగేళ్ల క్రితం తన రెండో కుమార్తె లలితను కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం దౌల్తాపురం గ్రామంలో నివాసముంటున్న తన సొంత అక్క కుమారుడు చంద్రశేఖర్‌కు ఇచ్చి పెళ్లి జరిపించాడు. కొన్నాళ్ల పాటు వీరి సంసారం సాఫీగా సాగింది. ఆ తర్వాత కలతలు మొదలయ్యాయి. మొదటి కాన్పు కోసం పుట్టింటికి వచ్చిన కుమార్తె తన భర్త వేధింపుల గురించి తల్లిదండ్రుల వద్ద చెప్పుకుని బాధపడింది.

వేధింపులు తాళలేక పుట్టింటికి

మొదటి కాన్పులో ఆడబిడ్డను ప్రసవించిన అనంతరం కుమార్తెకు తల్లిదండ్రులు నచ్చజెప్పి కాపురానికి పంపారు. ఎవరెన్ని చెప్పినా భర్త ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ క్రమంలోనే మూడో నెల గర్భం దాల్చిన లలిత ఏడాది క్రితం వేధింపులు తాళలేక పుట్టింటికి చేరుకుంది. ఆ తర్వాత ఆమె కాపురానికి వెళ్లలేదు. తన భార్యను కాపురానికి పంపాలని చంద్రశేఖర్‌ తరచూ గొడవపడేవాడు. కొన్ని నెలల క్రితం పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ కూడా పెట్టారు. అక్కడ కూడా లక్ష్మన్న తన కుమార్తెను కాపురానికి పంపే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఆ సమయంలో చంద్రశేఖర్‌ ఆవేశంతో ఊగిపోతూ లక్ష్మన్నను చంపుతానని రెచ్చిపోయాడు. పెద్ద మనుషులు నచ్చచెప్పడంతో అప్పటికి సమస్య సద్దుమణిగింది.

మాటు వేసి.. హతమార్చి

మామపై కక్ష పెంచుకున్న చంద్రశేఖర్‌ అదను కోసం కాచుకున్నాడు. ఈ క్రమంలో గురువారం గుంతకల్లుకు చేరుకున్న లక్ష్మన్న బ్యాంకులో రుణం చెల్లించి రాత్రి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. అప్పటికే తిమ్మాపురం – నల్లదాసరపల్లి గ్రామాల మధ్యన తన అన్న రాజశేఖర్‌, మరో వ్యక్తితో కలసి మాటువేసిన చంద్రశేఖర్‌.. ఒంటరిగా వస్తున్న లక్ష్మన్నపై ఒక్కసారిగా విరుచుకుపడ్డాడు. వేటకొడవళ్లతో విచక్షణారహితంగా దాడి చేయడంతో లక్ష్మన్న అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని పక్కనే ఉన్న చెట్ల మాటున పడేసి వెళ్లిపోయారు.

పట్టించిన పోలీసు జాగిలం

గురువారం అర్ధరాత్రి సమయంలో అటుగా వెళుతున్న వాహనదారులు రోడ్డుపై పడి ఉన్న రక్తపు మరకలు గమనించి అనుమానంతో చుట్టుపక్కల గాలించారు. చెట్ల మాటున పడి ఉన్న లక్ష్మన్న మృతదేహాన్ని గమనించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులతో పాటు పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అప్పటికే చంద్రశేఖర్‌ కూడా ఏమీ తెలియని వాడిలా అక్కడకు చేరుకుని బాధిత కుటుంబసభ్యులతో పాటు తానూ రోదిస్తూ కూర్చొన్నాడు. హత్య జరిగినట్లుగా నిర్ధారించుకున్న పోలీసులు వెంటనే అనంతపురం నుంచి క్లూస్‌ టీంతో పాటు స్నిప్పర్‌ డాగ్‌ను రప్పించుకుని రంగంలో దించారు. దాడి జరిగిన ప్రాంతం వద్ద చక్కర్లు కొట్టిన పోలీసు జాగిలం మెలమెల్లగా చంద్రశేఖర్‌ను చుట్టుముట్టింది. అనుమానం వచ్చిన పోలీసులు వెంటనే చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో తానే హతమార్చినట్లు అంగీకరించాడు. హత్యకు పాల్పడిన తీరును వివరించాడు. హతుడి భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు.